# కన్నయ్య



**అదిగో!**

వేయి రాగాలతో తనకొరకై పిలుస్తూ ఆ గానం పరుగెత్తుకొని వస్తూంది.

కమ్మని ఆ రాగసంచయం అలలుగా చుట్టలు చుట్టుకొని ఆహ్వానిస్తూ ఎదురువస్తూంది.

హృదయం ఆవేదనతో బరువెక్కి ఆనందంతో తేలిపోతూంది.

మనసు నిలవటం లేదు.

వ్రజం అంతా ఇంకా నిద్రకు సాగలేదు.

ప్రాంగణాన పైడిగోవు కంఠాన చిరుగంటలు గలగలలాడుతూనే ఉన్నాయి. తనను చూస్తే అది ఆప్యాయంగా పిలుస్తుంది. అందరూ లేస్తారు.

ఆయన గోపాలనలో శ్రమపడి ఇంటికి వచ్చి విశ్రాంతిగా నిద్రలోకి జారిపోయారు.

తను శయ్యపైనుండి మెల్లిగా లేచింది.

ఆలస్యం అయినకొద్దీ ఆ రాగమాధురి ఆకర్షణ శక్తిని అనంతంగా పుంజుకుంటూంది. తనను బలంగా పట్టి లాగేస్తూంది.

ఎటో వెళ్లిపోతూంది మనసు, గాలిరెక్కలపైన తేలిపోయే మేఘమాలికలా.

● ● ● ●

గంటల గలగల ఆగింది.

గోకులం అంతా సద్దుమణిగింది.

తను మెల్లిగా ద్వారం గడియ తీసింది. బయట అడుగిడింది. వాకిలి దాటింది.

యశోదమ్మ ఇల్లు సమీపిస్తూంది.

గుండెలో ఏదో గుబగుబ.

యశోదమ్మ ఇంకా నిద్రించిందో, లేదో? తన పద శబ్దానికి లేచి చూచి పిలిచి తనను ఆపివెయ్యదుగదా?

కాలి అందెలు చిందకుండా నడిచింది మెల్లిగా.

ఆ కొద్ది క్షణాలలో ఎన్ని సృష్టికాలాలు జరిగిపోయాయో తను గమనించలేదు.

ఈ యుగం అయిపోయిందా? కన్నయ్య, అందరూ ఉన్నారుకదా?

నుదుట మెరిసే వెచ్చని ముత్యాలను కొంగున అద్దింది.

తన పిచ్చి ఇది. తాను ఉండగా కన్నయ్య లేకపోవడం ఏమిటి? కాలం జరిగిపోవడం ఏమిటి?

ఎంత భయపడ్డది తను!

ఆ యశోదమ్మ ఎక్కడ చూస్తుందోనని ఎంత పిచ్చి ఆలోచన చేసింది!

అమ్మయ్య! ప్రమాదం దాటిపోయింది.

కంట నిలిచిన నీరు తుడుచుకుంది.

● ● ● ●

అదిగో!

చిన్నగా, మధురంగా, వెన్నెల పొంగులాగ ఉబికి వచ్చే గానమాధురి!

ఎటు?

ఎటో లాక్కుపోతూంది తనను.

తనకు వెండిరాగాల తీగె అను సంకెలవేసి పరుగెత్తిస్తూంది.

తను నడుస్తూందో, పరిగెడుతూందో, జారిపోతూందో, గాలిగుండా దూసుకుపోతూందో తెలియటం లేదు.

ఎక్కడిదీ గలగలం? ఏమిటి ఈ మధుర శబ్దం?

అహా! అది తన అందెలు గొణుక్కుంటున్న ఏదో కలకలగానం.

వాటికిగూడా కన్నయ్యను స్పృశించాలని తొందర పాటే.

ఛీ! తను ఈ పోటీ ఓర్వలేదు.

అయినా ఏం లాభం?

తన అందెల గలగల కన్నయ్యకు చాలా ఇష్టం. అవి అలంకరించుకోవడం మానివేస్తే కన్నయ్య తనపై చిరుకోపం నటించేవాడు. అతడి అధరం మెత్తగా అదిరేది.

అమ్మో! కన్నయ్యకు ఎంతగా కోపం!

ఉహు! కన్నయ్యకు — తన కన్నయ్యకు తనపైన కోపం రావటమా? అసంభవం.

కాని, తనకుమాత్రం కన్నయ్యపైన ఎప్పుడూ కోపం వస్తుంది.

అవును, ఎందుకు రాదు! మరీ అల్లరివాడు కన్నయ్య.

ఒక్కసారిగూడా ఏడిపించక ఊరుకోడుగదా!

ఒకచోట అగుపడి, మాయమై, తను అతడికోసం వెదికి వేసారుతూంటే ఇంకొకచోట మురళి ఊదుకొంటూ...

● ● ●

ఆహా!

మనసు ఏమిటో ఊగిపోతూంది.

అసలు తను భూమిపైన ఉన్నదా?

అదేమిటి!

గోకులం అంతా కిందికి దిగిపోతూంది!

తను గాలిలోకి లేచిపోతూంది!

పెద్దపెద్ద గృహాలుసైతం బొమ్మరిళ్లయిపోతున్నాయి.

ఇళ్ల అగ్రభాగాలు సూదిమొనలైపోతున్నాయి.

అన్నీ మెల్లిమెల్లిగా చూపుమేరకు దూరంగా దిగిపోతున్నాయి.

● ● ● ●

ఇదేమిటి!

అంతా ఏదో మధుర స్వప్నాల వెండితెరల మాటున మాయమైపోతూంది!

కళ్లు ఏదో అనంతమైన వెలుగుతో నిండిపోతున్నాయి.

ఏమిటి ఈ చల్లని స్పర్శ? ఎంత తియ్యగా ఉంది!

అవును, కన్నయ్య మురళీనాదం తనను హాయిగా స్పృశించి పిలుస్తూంది.

ఇంకా ఎన్ని యోజనాలు గడిచిపోవాలో తను?

మనసు పిచ్చిగా తిరిగిపోతూంది. మధుర విషాదంతో కొట్టుకుపోతూంది.

తను రివ్వున దివ్యులకు ఎగిరిపోతూంది.

కన్నయ్యకు ఇష్టమని కట్టుకున్న పాలరంగు కోక, మల్లెపూల రవిక ఎటో ఎగిరిపోతున్నట్టుగా ఉంది.

తను నగ్నంగా తేలిపోతూందా?

తన దేహం నిలవలేక ఊగిపోతూంది.

పోనుపోను ఈ రాగంలో, కన్నయ్య గానంలో తియ్యదనం మరింత వెల్లివిరుస్తూంది. స్వర్గంలో పూసే నక్షత్రపుష్పాలు తమ వెన్నెల మకరందాన్ని

కన్నయ్య గానమాధురికి ప్రతిగా ఎలా కురిపిస్తున్నాయో!

ఓహ్!

ఎంత తియ్యని స్వప్నం!

ఈ వెన్నెల శయ్య తన నెక్కడికో ఆ అలౌకిక గానం ఉబికి వచ్చే దిశకు దూసుకుపోతూంది.

అయినా తన అందెలు గలగలలాడుతూనే ఉన్నాయి.

వాటి కెందుకో ఇంత తొందర?

తనకుమాత్రం ఈ తొందర ఎందుకు?

అందెలు ఘల్లుఘల్లున నవ్వాయి.

ఎందుకు వాటికి తనుఅంటే అంత హేళన?

ఉహూ, కాదు!

అవి తన మధుర ప్రేమను చూచి ఓర్వలేక తనను మేలమాడుతున్నాయి, అంతే!

• • •

అదిగో!

ఆ నీలిరూపం ఎవరిది?

ఛ! ఎంత వెర్రి!

ఇంకెవరిది!

కన్నయ్య దూరానికి పారిపోతున్నాడు.

ఇదేమిటి, పాలసముద్రం మధ్యలో తేలిపోతూంది తను!

మురళీస్వనం తనను స్పృశిస్తూ అనంతమైన లోకంపైకి తేలిపోతూంది.

తన కన్నయ్య తనకు అందడా?

అదిగో, అక్కడ!

నల్లబండపైన పుద్దిచెట్టుపై ఒక కొనకు ఆనుకుని చిద్విలాసాన మురళిని నోటికి ఆన్చి రాగం ఆలాపిస్తున్నాడు.

ఆ మురళి అంటే తనకు ఎంతో కోపం.

అవును, ఎప్పుడూ కన్నయ్య అధరాలు దానికే అంకితం కదా!

తన అధరాలను అతడి అధరాలు కలిసి ఒకటి రెండు గడియలు పాడే తియ్యని రాగం తనను వివశను చేసి వేస్తుంది.

అటువంటి మధురాద్భుతమైన అతడి అధరాలను ఎల్లప్పుడూ ఆనుకుని ఆనందించే ఆ మురళి మానసికస్థితి వర్ణనాతీతం.

ఆ అనుభవం తాను వర్ణించగలదా?

తనకు ఆ మురళిపైన కోపమైనా, దానినుండి కన్నయ్య ఆలాపించే విశ్వమోహనరాగంతో సమ్మోహిత అయిపోతుంది.

• • •

తనతోపాటుగా కన్నయ్యను చేరాలని ప్రకృతి సుందరి ఎలా పరిగెడుతూందో!

అర్థంలేని కోరిక ఆమెది. కన్నయ్యను ఆమె పొందగలదా?

ఎంత తెలివిలేనిదైపోతూంది తను!

తనుమాత్రం చేసే ప్రయత్నం ఏమిటి?

కన్నయ్యను చేరాలనే కదూ! అతడిలో ఐక్యమైపోవాలనే కదూ!

అలా చెయ్యగల అర్హత తనకే ఉందనుకోవడం తెలివితక్కువ కాదా!

ఎందుకవుతుంది? తను ఒప్పుకోదు.

**కన్నయ్య! అతడి రూపం గురించి ఏమని చెప్పడం? ఎంత చెప్పినా ఎలా తనివి తీరుతుంది? 'త్రైలోక్యాకర్షణాంగం సురనరగణికా మోహనాపాంగమూర్తిం' అని లీలా శుకుడు చెప్పుకొన్నాడు. ఆ దేవకీనందనుని వేణుగాన మాధుర్యం గురించి ఏమని చెప్పడం? లోకాలనన్నిటిని సమ్మోహపరిచే మాధుర్యమది. మరి దేనినీ కోరకుండా చేసేదీను.**

కన్నయ్య తనవాడు.

అవును, తనవాడు.

తా నాతడిలో భాగం. అతడు తనలో భాగం.

అతడు తాను. తాను అతడు.

హృదయం గొణిగింది.

కన్నీరు ఉబికింది.

• • •

తెల్లని స్ఫటికపు యవనికలు రివ్వున తన పక్కగా మిరుమిట్లుగొల్పుతూ జారిపోతున్నాయి.

స్ఫటికపు ఫుంతలగుండా తా నెటో జారిపోతూంది.

హఠాత్తుగా, ఎదటినించి ఎక్కడివో కెరటాలు, చెంగుచెంగున ఎగిరి వచ్చిపడుతున్నాయి. వాటి గంభీర ధ్వనిలో కన్నయ్య మురళీనాదం కరిగి స్వనిస్తూంది.

జల్లున తనపైన విరిగి పడిపోతున్నాయి ఆ కెరటాలు.

అదిగో, వాటి మధ్యగా కన్నయ్య మురళి ఊదుతూ తేలి వస్తున్నాడు.

అవును, వస్తున్నాడు తనవైపే.

ఇంకొక్క కెరటం, ఆ తరవాత తను కన్నయ్య సరసన ఉంటుంది.

అరే!

ఏదీ కెరటం?

ఆ గానలహరి ఎటో ప్రవహించిపోతూంది.

ఏమిటో అంతా అగమ్యగోచరంగా ఉంది.

అయినా తా నింకా ముందుకు సాగిపోతూనే ఉంది.

• • •

హఠాత్తుగా, ఏదో మత్తు చీకటి ఆవహించేస్తూంది.

"ఘల్లు!"

ఇదేమిటి?

మిలమిలలాడుతూ ఒక నక్షత్రం ఆ చీకటి చిక్కునుంచి జారిపోయి రాలిపోయింది. నిస్పృహ ఆవరిస్తూంది.

ఈ చీకటి తనను ముంచుకుపోతుందా?

"నా ముద్దుల కన్నయ్యా! ఏమిటీ విపరీతం! రుద్రుని జడలాగ, కాలదేవత కాటుకలాగ ఏమిటి ఈ నల్లని కటిక చీకటి?"

తన వెడల్పు కళ్ళలోనికి ఈ చీకటితీగెలు పాడుస్తున్నాయి.

రెండు చేతులతో తల పట్టుకుంది తాను.

ఆహా ! తన వేణీభరం విడిపోయి తన నెంత భయపెట్టింది!

వజ్రం పొదిగిన నాగరం కొప్పునుంచి నక్షత్రంలా రాలిపోయింది క్షణంక్రితం. అలలవలె తన కేశజాలం వెనకకు ప్రవహించిపోతూంది.

కన్నయ్య ఈ కేశాలను ఎన్నివార్లు చుంబించాడో!

"నీ వేణి అంటే నాకు చాలా ఇష్టం" అంటాడు కన్నయ్య.

తను అతడి వక్షాన వాలినప్పుడు, "నాకు నీ మృదువైన వేణీభరం కావాలి, నీ వక్షర్లేదు" అని చిరునవ్వు దాచుకొంటూ భయపెడతాడు చిలిపి కన్నయ్య.

• • •

అదిగో, ఒక్క క్షణంమాత్రం ఆగక అనంతంగా ప్రవహిస్తున్న శ్రీకృష్ణ రాగసుధ!

అదేమిటి, దూరాన వెండిపొడి చల్లిన విశాల ప్రాంగణం?

అది యమున కదా!

అవును, యమున తన సంపూర్ణ సౌందర్యంతో కన్నయ్య పాదాలను స్పృశించే కోరికతో ఉబికి ప్రవహిస్తూంది.

కన్నయ్యకు ఎంత పక్షపాతమో!

తన లేత పాదపద్మాలను ఆ యమునలో మెల్లగా కదుపుతూ వేణువు ఊదడం ప్రారంభిస్తాడు.

తను ఆ పాదాలవద్ద దేహాన్ని అర్పించి ఆ గాన మాధురిలో కరిగిపోదామని ఎంత కోరుకున్నా, ఆ అదృష్టం యమునకే దక్కుతుంది.

ఛ! తప్పు!

తాను యమున నిర్మలప్రేమను, భక్తిని ఆపగలదా!

తనకు తన కన్నయ్య ఉన్నాడు గదా!

ఆమెకు అతని పాదాలవద్ద చోటు, ఆమె తప్పేమున్నది?

• • •

తిరిగి ఇది ఏమి?

ఏమిటి ఈ అంధకారం?

ఇది తన వేణి కాదు.

మరి ఈ వెలుగుచీకట్ల కలగలుపులకు కారణం?

అవును, ఇవి వృక్షచ్ఛాయలు. వాటిగుండా జారే వెన్నెలలే ఈ వెలుగుపరకలు. యమున ఒడ్డున కన్నయ్యకు నీడను, సౌఖ్యాన్ని అందించి, అతని మురళీరవళిలో తమ జన్మలను ధన్యం చేసుకోవడానికి తపస్సు చేస్తున్నవి ఈ మూగ జీవాలు.

"కన్నయ్యా!"

మళ్ళీ హృదయం గొణిగింది.

ఎక్కడ తన కన్నయ్య?

ఎప్పటిలా తనను ఆటలాడించడంగదా?

తను ఇంత ప్రయాసపడి వచ్చినందుకు కూడా చూపించక పోతాడా తన కన్నయ్య!

"దొంగ కన్నా!

నన్ను ఈనాడు బాధ పెట్టవద్దయ్యా!

అయినా నీవు వినవులే!

నా ప్రేమలో నా బాధ ఏపాటి!

నీ దరిజేరిన సౌఖ్యంలో ఈ ప్రయాణ మేపాటి!

నీకడ వసించడంలో ఈ వేసారుట ఏపాటి!

ఎక్కడ దాగున్నావు?

## సోమంచి వినయభూషణ్

నా హృదయం ఉలికి పోతూంది.

నాలోని ప్రేమ ఝరులు పొంగుతున్నాయి.

గుండె నదుముకొని ఈ తియ్యని ఆతపాన్ని ఎంత సేపు భరించగలను?

వివశనై పోతున్నాను.

శరీరం మూర్ఛపోతూంది.

నీ వక్షాన అనుకోవాలనని ఎంత ఆవేగంతో నా హృదయం స్పందిస్తూందో గ్రహించావా?"

ఆహా! వేయి జన్మల ధన్యత, కన్నయ్య స్పర్శ!

ఆ కన్నులలోని స్వచ్ఛత ఏమి వెలుగో మరి!

అది సమస్త లోకాలనే కట్టివేస్తుంది. ఇంక తానెంత!

ఆవేళ...

• • •

ఆవేళ...

తాను, నీలావతి నీరుకేగా పోతున్నారు.

ఇంతలో, రెండు మహా సాలవృక్షాలు ఫెళఫెళా కూలాయి.

ఎవరో పిల్లవాడు, నేరేడుపండు చాయ, ఆ మధ్యన ఉన్నాడు.

దగ్గిరికి పరిగెత్తింది తాను.

అతడి కటిప్రదేశంలో రజ్జువుతో కట్టిన రోలు.

ఎక్కడినుండి వచ్చింది అది?

అతడు యశోద కొడుకట! — నీలావతి అన్నది.

కొంటెవాడని కట్టివేస్తే ఆ పని చేశాడు.

ఏమయిందోనని భయపడింది తాను.

అతడు ఏమీ తెలియనట్లు చిరునవ్వు చిందాడు.

తన ఒడలంతా పులకించిపోయింది.

హృదయం ఉప్పొంగిపోయింది.

అతణ్ణి వెంటనే ఒడిలోనికి తీసుకొన్నది.

వక్షాన అదుముకుంది.

తిరిగి అతడు చిరునవ్వు చిలికాడు.

అతడి కళ్లలో సర్వాతీతమైన స్వచ్ఛత మెరిసి ఉంది.

తన కళ్లలోనికి చూశాడు.

తను సంపూర్ణంగా వివశ అయిపోయింది.

ఆ చూపు తనలో స్థిరనివాసం ఏర్పరుచుకుంది.

ఆవేళనుండి తను అతడికి అంకితం అయిపోయింది.

ఆ పిల్లవాడు అంతటితో ఊరుకున్నాడా!

తనతో "నువ్వంటే నాకు ఇష్టం. ఎంత అందంగా ఉన్నావు!" అన్నాడు.

ఎంత అబద్ధం ఆడాడు!

తను అతడికంటే ఏమి అందమయిందని!

ఆ మధురమూర్తి అలా అనగానే చెక్కిళ్ళు వింతగా వెచ్చనయ్యాయి.

అలా బంధించివేశాయి ఈ కన్నయ్య కళ్లు తనను.

తానింక అసహాయురాలు!

• •

అదిగో, యమున.

స్ఫటికపు అరుగులవలె ఆ శ్వేతసైకతాలు, వెన్నెలలో ఆరబోసిన పిండివలె చల్లగా ఉన్నాయి.

తన కన్నయ్య ఏడీ?

యమున గలగల నవ్వుతూంది.

ఎందుకు?

తను తన కన్నయ్యను కనుగొనలేకపోయిందనా?

కన్నయ్య తనకు అందక ఎక్కడికి పోగలడు!

"నీవు లేనిదే నా పాటలో పరిపూర్ణత రాదు, రాగమయీ!" అంటాడు ఎప్పుడూ.

ఏదో కొత్తపేరుతో పిలుస్తాడు, ఈ కొంటె కన్నయ్య నిత్యం.

అతడు ఎలా పిలిచినా తన హృదయం పలుకుతుంది.

అర్థంలేని ఆనందం ఒడలంతా పాకుతుంది, కన్నయ్య పిలుపుతో.

ఇప్పుడు ఆ వేణువు పిలుపు ఎక్కడినుండి వినవస్తూందో తెలుసుకోలేకపోతూంది తను.

అదిగో...

ఆ చూతవృక్షం గుబురుపొదికి వంగిఉన్న చోటున దాని నీడనుండి ఆ రాగం ఉలికి వస్తూంది.

యమునే ఏదో పాడుకుంటున్నట్లుగా గల గల శబ్దంలో సమ్మిళితమై పరిగెడుతూంది ఆ గానం.

తన ఉపవేలు ఆనందంగా పాడాయి.

చూతవృక్షచ్ఛాయకు చేరింది తను.


కన్నయ్య కనపడడేమి?

ఆ స్వర మధురిమ ఇప్పుడు దగ్గిరగా వినవస్తూంది

తను మూర్ఛలోనికి జారిపోతూంది

శరీరం మధురస్వనమహత్తులో మునిగి తేలుతూంది

ఆనందోద్రేకంలో బాష్పాలు అనవరతంగా జాలువారుతున్నాయి



చిదంబరం ఆలయంలో నృత్యమంచి ఫోటో—రామదాసు (మద్రాసు)

అదేమిటి?

ఆ రెండు ఆనందకరజ్యోత్స్నలు?

అవును, అవి వెన్నెల దీపాలు.

తన హృదయసాగరానికి అవి వెన్నెల దీపాలు.

ఒక్కసారిగా తన హృదయం ఎగసి పడింది.

వేణునాదం హఠాత్తుగా ఆగిపోయింది.

దానికి బదులు —

"రాధా! రాధా!" తన కన్నయ్య తియ్యని పిలుపు.

జన్మజన్మాల కాలుష్యాన్ని ఒక్క ఊపున విసిరివేసే పవిత్రస్వరంతో — తన పేరుతో — కన్నయ్య తనను పిలుస్తున్నాడు!

అతడి కళ్ల వెలుగు తనలోనికి చొచ్చుకుపోయి హృదయంలో అలుముకుపోయింది.

"కన్నయ్యా!"

తన హృదయం అరిచింది

అధరాలు చలించాయి

వేణీభరం ఊగింది

ఆనందకరమైన తన తొట్రుపాటుకు తాళం వేస్తూ, అందెలు గుజగుజ నవ్వాయి

కంఠా సుధాలహరి సుళ్ళు తిరిగింది.

చెక్కిళ్ళలో వెచ్చని ఆనందం పాకింది.

చేతులు ఆశ్లేషాహ్వానంతో ముందుకు సాగాయి.

కన్నయ్యలో తాను కరిగిపోయింది.

తన కన్నయ్యతో తాను సురిగిపోయింది. ★